క్లుప్తంగా

వ్యాధులపై సర్వే



ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: అన్ని గ్రామాల్లో ఇంటింటా సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు సర్వే చేస్తున్నామని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా అన్నారు. ఆదివారం వేగవరంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటింటా చేపట్టిన అవగాహన సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. మారుతున్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత సామూహిక పరిశుభ్రత విధిగా పాటించాలన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి అందరూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలన్నారు. అవగాహన సర్వే కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు ఉన్నారు.

గౌరీదేవి ఆలయ పునర్నిర్మాణం ప్రారంభం



ఆలయ పునర్నిర్మాణానికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు: పోతునూరులో ఆదివారం గౌరీదేవి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. త్వరితగతిన ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని ఆలయ కమిటీ వివరించారు. తొలుత అమ్మవారికి పూజలు చేసి పనులు ప్రారంభించారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



నూతన ఆలయంలో ప్రతిష్ఠించిన స్వామి, అమ్మవార్ల విగ్రహాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక తంగెళ్లమూడి సీతారామ నగర్‌లో నూతనంగా నిర్మించిన మహాగణపతి, సీతా రామచంద్రస్వామి, కనక దుర్గమ్మ వార్ల మూల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల 22 నిమిషాలకు మూలా నక్షత్రయుక్త మేష లగ్న పుష్కరాంశ శుభ ముహూర్తాన ఈ మూల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పాంచాహ్నిక దీక్షగా నిర్వహించినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ విచారపు శ్రీనివాసరావు దంపతులు, యండ్రాపు పోలినాయుడు దంపతులు, విచారపు వెంకట సుబ్బయ్య దంపతులతో పూజ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు దేవరకొండ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు. 5వ తరగతి 80 సీట్లు, జూనియర్ ఇంటర్ బైపీసీ 40 సీట్లు, ఎంపీసీ 40 సీట్లు భర్తీ చేస్తామన్నారు. అర్హులైన విద్యార్థినులు హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 6 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు.

అసత్య ప్రచారాలను నమ్మొద్దు

వేలేరుపాడు: పోలవరం నిర్వాసితులు అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దని కేఆర్‌పురం ఐటీడీఏ పీఓ, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ అధికారి కె.రాములునాయక్ హితవు పలికారు. నిజమైన నిర్వాసితుడికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో పూర్తి న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుక్కునూరు మండలంలోని చీరవల్లిలో ఇంటి విలువల(స్ట్రక్చర్ వాల్యూ)కు సంబంధించి తనపై వచ్చిన ఆరోపణలను పీఓ తీవ్రంగా ఖండించారు. తన దగ్గరకు సమస్య పరిష్కారం కోసం వచ్చిన బాధితులకు న్యాయం చేసే క్రమంలో ఫోన్ చేసి నిర్వాసితులు గొడవలు పడొద్దు... ఏదైనా ఉంటే కుటుంబీకులు సెటిల్ చేసుకోండని మాట్లాడితే దాన్ని వక్రీకరించి నిర్వాసితుల్లో గందరగోళ పరిస్థితి సృష్టిస్తూ, కొందరు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు?

- అడ్డూ అదుపూ లేకుండా కోళ్లు, జంతు వ్యర్థాల రవాణా
- చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు



తనిఖీలో నిడమర్రు పోలీసులు పట్టుకున్న కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్న వాహనం (ఫైల్)

గణపవరం: ఎంత కఠిన చట్టాలున్నా కోళ్ల వ్యర్థాలు నిరాటంకంగా రవాణా అవుతున్నాయి. ఒకవైపున పోలీసులు దాడులు చేసి దొరికిన వాహనాన్ని సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తున్నా అక్రమ రవాణాదారులు లెక్కచేయడం లేదు. కొందరు చేపల చెరువుల యజమానుల స్వార్థం కారణంగా ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది.తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చన్న కొందరు దళారుల దురాశ ఈ అనర్థానికి కారణమవుతోంది. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రమాదమని తెలిసినా కోళ్లు, ఇతర జంతు వ్యర్థాలను యథేచ్ఛగా రవాణా చేస్తూ డెల్టా ప్రాంతంలో చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ఇందుకు అవసరమైన కోళ్ల వ్యర్థాలు మన రాష్ట్రం నుంచే కాక పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుంచి కూడా వాహనాల్లో రవాణా చేస్తున్నారు. ముఖ్యంగా మాంసాహారం అధికంగా వినియోగించే ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు మాంసం దుకాణాలు, చేపల మార్కెట్ల వద్ద దుకాణదారులు వాటి వ్యర్థాలను ప్లాస్టిక్ డబ్బాల్లో వేసి ఉంచుతారు. వాటిని తరలించడానికి దుకాణదారులతో దళారులు ఒప్పందం చేసుకుని, వాటిని రాత్రి వేళల్లో రహస్యంగా సేకరించి మినీ లారీలు, వ్యాన్లు, ఆటోల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. చికెన్, మటన్ దుకాణదారులు ఈ వ్యర్థాలను వదిలించుకోవడానికి ఇంతకన్నా మరో సులువైన మార్గంలేక ఈ దళారులకు ఇచ్చి వేస్తున్నారు. దీని నిమిత్తం వ్యాపారులకు ఏడాదికి రూ.10 నుంచి రూ.15 వేల వరకూ చెల్లిస్తుంటారు. దళారులు వీటిని రహస్యంగా తరలించి చేపల చెరువుల యజమానులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చేపల చెరువుల యజమానులు మేతల ధర కంటే ఈ వ్యర్థాలు తక్కువకు రావడంతో వీటిని కొన్ని రకాల చేపలకు ఆహారంగా వేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తే కఠిన చర్యలు



కోళ్ల వ్యర్థాల రవాణాపై గట్టి నిఘా పెట్టాం. పర్యావరణానికి అత్యంత హాని చేసే వీటిని రవాణా చేయడం చట్టరీత్యా నేరం. ఇప్పటికే సర్కిల్ పరిధిలో పలు వాహనాలు పట్టుకుని కేసులు నమోదు చేశాం. వీటిని రవాణా చేసే వ్యాపారులపై నిఘా ఉంచి కోళ్ల వ్యర్థాలు రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. చేపల రైతులు కూడా వీటిని వినియోగించకూడదు.

– ఎంవీ సుభాష్, సీఐ, గణపవరం

ప్రభుత్వం నిషేధించినా ఫలితం శూన్యం

పర్యావరణానికి పెనుప్రమాదకరమైన కోళ్లు ఇతర జంతు వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేయడాన్ని నిషేధిస్తూ దశాబ్దకాలం క్రితమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా కొందరు అక్రమార్కులు మాత్రం రహస్యంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తూనే ఉన్నారు. ఎక్కువగా రాత్రి సమయంలో అర్ధరాత్రి, తెల్లవారుజామున వీటిని తరలిస్తుండగా మరికొందరు పట్టపగలే వీటిని తరలిస్తూ ప్రజలను నానా ఇబ్బంది పెడుతున్నారు. పోలీసులు ఎంత నిఘాపెట్టినా వారి కళ్లుగప్పి రవాణా చేస్తున్నారు. ఇటీవల నిడమర్రు సర్కిల్ పరిధిలో పోలీసులు రాత్రి వేళల్లో ఐదారు కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకుని కేసులు పెట్టారు.

ఖర్చు తక్కువని

చేపలకు మేతగా డీవోబీ (నూనె తీసిన తవుడు) వినియోగిస్తుంటారు. దీని ధర ఎక్కువ కావడంవల్ల ఆరు నెలలకు సగటున మూడు లక్షల వరకూ ఖర్చవుతుంది. దీని స్థానంలో మాంసం వ్యర్థాలను మేతగా వేస్తే లక్ష రూపాయల లోపే ఖర్చు అవుతుంది. చేపల మేత కిలో రూ.35 వరకూ ఉండగా చికెన్ వ్యర్థాలు 10 రూపాయలకే రావడంవల్ల రైతులు వీటిపై మక్కువ చూపుతున్నారు. ఎకరా చేపల చెరువుకు సంప్రదాయ మేత రోజుకు 20 కిలోల చొప్పున రూ.700 ఖర్చు అవుతుంది.ఈ మేతను చెరువుల్లో కట్టడానికి కూలీ ఖర్చు మరో రూ.200 అదనం. ఈ ప్రకారం నెలకు సుమారు రూ.25 వేలు ఖర్చు అవుతుంది. అదే కోళ్ల వ్యర్థాలు 200 కిలోల డ్రమ్ము రూ.2 వేలకు వస్తుంది. ఈ లెక్కన నెలకు పది నుంచి పదిహేను వేల రూపాయలు మాత్రమే ఖర్చు అవుతుంది. ఖర్చు సగానికి సగం తగ్గడం వల్ల రైతులు కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం కోళ్ల వ్యర్థాలను రోజూ డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. ఆదాయం వస్తుందన్న ఆశతో వ్యాపారులు వీటిని దాచి ఉంచి దళారులకు విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి పెనుముప్పు

కోళ్లవ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనం రోడ్డుపై వెళ్లిందంటే ఆ వాహనం వెళ్లిన 10 నుంచి 15 నిమిషాల వరకూ దాని దుర్వాసనకు పరిసర ప్రాంతం ప్రజలు ఇబ్బంది పడాల్సిందే. ఇలాంటి వాహనాలు వెళ్తుంటే దాని నుంచి వెలువడే దుర్గంధంతో రోడ్డున వెళ్లే ప్రయాణికులు, రోడ్ల వెంబడి ఉన్న వ్యాపారులు, దుకాణదారులు, సమీప గృహస్తులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రజలకు ఇంత ఇబ్బంది కలుగుతున్నా స్వార్థంతో కొందరు ఈ అక్రమ రవాణాను కొనసాగిస్తూనే ఉన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి నగరంలోని హైస్కూల్ విద్యార్థులకు భారతం, రామాయణంపై అనగాని శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు కైకలూరుకు చెందిన ఘంటసాల బసవయ్య ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి పార్వతి రామచంద్రన్ శిష్యులు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి, అలరించారు. అర్చక స్వాములు దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్‌కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదాం



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు : కూటమి ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలపై సమష్టిగా పోరాడుతామని, ఈ ప్రభుత్వం పెట్టే తప్పుడు కేసులకు భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం శ్రీరామవరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను కాపాడుకుంటామని, వారికి అండగా ఉంటామని, అధైర్య పడవద్దని చెప్పారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా వాటిపై ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వం తీరును గమనిస్తున్నారని అన్నారు. తగిన సమయంలో వారు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. శ్రీరామవరం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



పోలసానిపల్లిలో ఓ ఇంటి వద్ద తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమడోలు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని భీమడోలు ఈవోపీఆర్‌డీ ఏ.సుందరి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల పారిశుధ్య కార్యక్రమాల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ముగింపు రోజైన ఆదివారం పోలసానిపల్లి, అంబర్‌పేట, పూళ్లలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును భీమడోలు ఈవోఆర్డీ సుందరి పరిశీలించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మహిళలకు తడి–పొడి, చెత్త సేకరణపై అవగాహన కల్పించి, కరపత్రాలను అందించారు. తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారీ చేయాలని, పొడి చెత్తను ప్రతి గురువారం విక్రయించి పంచాయతీలు ఆర్థిక స్వావలంబన పొందాలన్నారు. పర్యావరణాన్ని శాసిస్తున్న ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ.సుందరి, పంచాయతీ కార్యదర్శులు వెంకట్రావు, జయరామకృష్ణ, డ్వాక్రా సంఘాల సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రోగాల వ్యాప్తి- నివారణపై అవగాహన కల్పించాలి



భీమడోలులో పీఎంపీ వైద్యులకు సూచనలు, సలహాలు అందిస్తున్న డాక్టర్ ఫణి తేజ విల్లా

భీమడోలు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రోగాల వ్యాప్తిపై అవగాహన కల్పించి, వారిని చైతన్యపర్చి ఆరోగ్యవంతులు తీర్చిదిద్దేందుకు పీఎంపీలు తమ వంతు కృషి చేయాలని ఏషియన్ ఉషోదయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆర్థోపెడిక్, రుమటాలజిస్ట్ డాక్టర్ ఫణి తేజ విల్లా అన్నారు. భీమడోలులో ఆదివారం ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమడోలు, ద్వారకాతిరుమల, నల్లజర్ల, తాడేపల్లిగూడెం మండల యూనిట్ల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా డాక్టర్ ఫణి తేజ విల్లా, యూరాలజీ, జనరల్ సర్జరీ వైద్యుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొని నేటి సమాజంలో వచ్చే రోగాలు–వాటి నివారణపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డాక్టర్లను పీఎంపీలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వణుకూరి మురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వి.రమేష్, యాక్షన్ కమిటీ చైర్మన్ ఎస్.కోటేశ్వరరావు, కార్యదర్శి జగదీష్, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికల ప్రదర్శన



'ఎడారిలో వాన చినుకులు' నాటిక ప్రదర్శన



'సారీ రాంగ్ నంబర్' నాటికలో ఓ సన్నివేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గరికపాటి నాటకోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రదర్శించిన మూడు నాటికలు మానవ సంబంధాలు మంటగలుస్తున్న ప్రస్తుత సమాజంలో బంధాలు, బంధుత్వాల విలువలను తెలుపుతూ డబ్బు కోసం పాకులాడవద్దు అని చెబుతూ సందేశాత్మకంగా, హాస్యాన్ని పంచుతూ సాగాయి. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో జరిగిన ఈ నాటకోత్సవాల్లో మొదటగా కాకినాడకు చెందిన శ్రీ సాయి క్రియేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో సీహెచ్ మహేష్ దర్శకత్వంలో ఎడారిలో వాన చినుకులు నాటికను ఆద్యంతం ఆసక్తికరంగా ప్రదర్శించారు. రెండవ నాటికగా నగరానికి చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎండీ కాజావలీ దర్శకత్వంలో సారీ రాంగ్ నంబర్ నాటిక ప్రదర్శించారు. మూడవ నాటికగా గుంటూరుకు చెందిన ఆరాధన ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నడింపల్లి వెంకటేశ్వర రావు దర్శకత్వంలో ప్రదర్శించిన మరీ అంతొద్దు నాటిక హాస్యయుతంగా సాగింది. తొలుత జరిగిన రెండవ రోజు నాటికల ప్రారంభ సభకు గరికపాటి కాళిదాసు అధ్యక్షత వహించగా డాక్యుమెంటరీ నిర్మాత జమలాపురం రాధాకృష్ణ, ప్రముఖ సినీ రచయిత పి.రాజేంద్రకుమార్, మైలవరపు బాల సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

బలివే రామలింగేశ్వరుడి దర్శనానికి ఏర్పాట్లు



బలివే రామలింగేశ్వర స్వామి



ఆలయ ఆవరణలో ఆహ్లాదకరంగా గడిపేందుకు ఏర్పాటుచేసిన రంగుల రాట్నం, ఆట వస్తువులు

పెదవేగి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ముస్తాబయ్యాయి. విజయరాయి శివారు ప్రాంతం బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేసారు. ఇక్కడ ఏటా మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి వేలాది మంది బలివేలో స్వామిని దర్శించుకుని, పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ఉత్సవాలను ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ఎంతో ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి నిత్యం ధూపదీప నైవేద్యాలతో, పూజలతో ఆలయ ప్రాంగణం మార్మోగుతుందని, ఫిబ్రవరి 26వ తేదీ బుధవారం రాత్రి 11 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య, నిర్వాహకులు చెబుతున్నారు.

ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం

ఆలయ ప్రాంగణమంతా శుభ్రం చేయించి, రంగులు వేయించాం. సుమారు 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గుజరాతీ పందిళ్లు వేసి, శానిటేషన్ పూర్తిస్థాయిలో నిర్వర్తించాం. భక్తులకు అసౌకర్యం కలుగకుండా మూడు ప్రాంతాల్లో జల్లు స్నానాలు చేయడానికి భక్తులకు సౌకర్యం కల్పించాం. వృద్ధులకు, చిన్నారులకు ప్రత్యేక దర్శనంతోపాటు, వైద్య సిబ్బంది, పోలీస్ వారు ఉండటానికి సదుపాయం కల్పించాం.

– పామర్తి సీతారామయ్య, కార్యనిర్వహణాధికారి, బలివే దేవస్థానం





ఆలయ ముఖద్వారం ఎదురుగా క్యూలైన్‌లో నిలబడేందుకు బారికేడ్ల ఏర్పాటు, పవిత్ర స్నానాలు ఆచరించేందుకు ఏర్పాటుచేసిన స్నానఘట్టం

విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేసిన విద్యార్థులతో నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఆర్థికంగా వెనుకబడిన 26 మంది కాపు విద్యార్థులకు ఆదివారం స్థానిక కాపు సంఘ కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేసారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త నారా శేషు ఏలూరు కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంఘం ఆధ్వర్యంలోని విద్యానిధికి రూ.1,00,116 విరాళం అందజేశారు. సంఘం విద్యానిధి రూపంలో ఉన్న డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ మొత్తం రూ.78,000 ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఆర్థికంగా వెనుకబడిన 26 మంది కాపు విద్యార్థులకు స్కాలర్ షిపుల రూపంలో అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.3,000, చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా నారా శేషు మాట్లాడుతూ కాపు, తెలగ, ఒంటరి సంఘం విద్యానిధి ఏర్పాటు అభినందనీయమన్నారు. పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ విద్యానిధికి తమ వంతు సహాయం కూడా అందజేస్తానని ఆయన, అప్పటికప్పుడు తమ తండ్రి పేరు మీద రూ.100116, విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జెట్టి సింహాద్రి రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

టి.నరసాపురం: మండలంలో కోడిపందేల స్థావరంపై టి.నరసాపురం పోలీసులు దాడులు నిర్వహించారు. కృష్ణాపురం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. వీరి నుంచి రూ.13 వేలు నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్లకు చలిమిడి, పానకాలు సమర్పణ



మద్దిరామమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



భీమడోలులో గ్రామ దేవతలకు చలిమిడి, పానకాలు సమర్పిస్తున్న భక్తులు

భీమడోలు: భీమడోలులో 12 ఏళ్ల కొకసారి నిర్వహించే గ్రామ దేవతల జాతర మహోత్సవాల్లో భాగంగా మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుకు రెండవ ఆదివారం తెల్లవారుజాము నుంచి చలివిడి, పానకాలు సమర్పణ కార్యక్రమం భక్తులు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా చిన్నా పెద్ద తేడా లేకుండా భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేసారు. దీనితో ఆలయాల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్ల ద్వారా భక్తులు వెళ్లి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో చలిమిడి, పానకాలను సమర్పించారు. తొలుత అమ్మవార్లకు భక్తులు చీరలు, జాకెట్లను సమర్పించారు. మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. తొలుత గణాచారులు అమ్మవారి ఘటాలను శిరస్సుపై ఉంచుకుని గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు గణాచారులకు స్వాగతం పలికి పసుపు నీళ్లతో పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై మే 10న పరీక్ష



భారత రాజ్యాంగంపై నిర్వహించే పరీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగం, సాధించిన ప్రగతి అమలు తీరు, బహుజన వారియర్స్ జీవిత చరిత్రలు, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచనలు –ప్రసంగాలు అనే అంశంపై మే 10న శనివారం గుంటూరులో నిర్వహించే పరీక్షలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఏలూరు జిల్లా కో ఆర్డినేటర్ మేతర అజయ్ బాబు కోరారు. ఏసీఎఫ్ సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పరీక్షకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ పరీక్షలో ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75,000, తృతీయ బహుమతి రూ.50,000, నాలుగు నుంచి పదవ బహుమతి వరకు రూ.25,000 ఉంటాయని తెలియజేశారు. విద్యార్థులు, యువకులు, మేధావులు భారత రాజ్యాంగంపై ప్రచారం చేయాలన్నారు. ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, ఈ పరీక్ష రాసేందుకు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని తెలిపారు. 150 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ విధానం పరీక్ష ఉంటుందని, పరీక్షలో మెరిట్ సాధించిన మొదటి వంద మంది అభ్యర్థులకు మీలో ఎవరు బహుజన పేరిట నిర్వహించే టీవీ షోలో పాల్గొనే అవకాశం కల్పిస్తారన్నారు. వివరాలకు 7032686204 ఫోన్ నెంబరును సంప్రదించగలరని తెలిపారు. మేతర అశోక్, కొండేటి ప్రతాప్, గండికోటి రంగారావు, చొటపల్లి సూర్యం, రవికాంత్, గుజ్జుల నాగేంద్ర, పొలిమేర సురేష్, కాకర్ల రాజేంద్రప్రసాద్, సోమ్లు నాయక్, కొమోజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.